# బతుకే బంగారం

రచన : మాస్టర్ రవి

ఆ మాట విన్నప్పుడల్లా రమణమూర్తి గుండెల్లో ఏదో చెప్పలేని బాధ ప్రారంభమౌతుంది. తనకి తెలియకుండా జరిగిన తప్పు కాదది. తానే స్వయంగా, చేజేతులా, తన చేతకాని తనానికి నిదర్శనంగా చేసుకు వచ్చాడు.

వందలకి వందలు జీతాలు తెచ్చుకుంటున్న వాళ్ళకే దిక్కులేదు. తనబోటి వాళ్ళెంత లెఖ్ఖ? నెలకి వచ్చే రెండువందల చిల్లరతో తను, జానకి, ఇద్దరు పిల్లలు గడుపుకోవడమంటే మాటలా? ఇంటద్దె ఒక్కటే జీతంలో నాలుగోవంతు పోతుంటే ఇహ తినేదేవుంది?

ఏది లేకపోతే గడుస్తుంది రోజుల్లో? చక్కటి పాలు కాకపోయినా ఒకొంతు పాలలో మూడొంతుల నీళ్లు కలిపేనా ఇవ్వాలికదా పిల్లలికి. రోజూ కాకపోయినా రెండు రోజులకొకసారేనా కూర చేసుకోవాలి కదా?

ఆఫీసు దూరం కావడంవల్ల రోజూ బస్సుమీద వెళ్ళాలి. రానూ పోనూ నలభై పైసలు బస్సు ఛార్జీ. నెలకి పదిరూపాయల పైన దాని మొహాన పొయ్యాలి.

ఇలాంటి పరిస్థితిలో చెల్లెలి పెళ్ళి చెయ్యాల్సి వచ్చిన తనకు ఇంకోమార్గం కనిపించలేదు. తన పరిస్థితి తెలిసి తనకెవరు అప్పిస్తారు? అందుచేత... అందుచేత.. ఐదు సంవత్సరాల క్రితం జానకి మెడలోవున్న గొలుసు, చేతి గాజులు - పెళ్ళిలో పెట్టినవి - తెగనమ్మక తప్పలేదు. దాదాపు ఎనిమిది వందలొచ్చాయి. పెళ్ళి ఖర్చుల్లో అదేమూల?

ప్రావిడెంటు ఫండులో ఒక వెయ్యి, ఒక నెల జీతం అడ్వాన్సు, అంతకుముందు దాచిన పాతిక పరకా ఇలా కలిసి, ఆ పండగ ఈ పండగ అయిందనిపించాడు.

నెలకి ఓ పది రూపాయలు మూలపడేస్తే, ఓ ఐదేళ్ళనాటికేనా, జానకి మెడ పచ్చబరచలేనా అని అనుకున్న రమణమూర్తికి నిరాశే మిగిలిపోయింది.

మెడలో ఒట్టి పసుపుతాడు వేసుకుని తిరగడం చూడలేక రోల్డుగోల్డు నగలు తెచ్చి ఇచ్చాడు దెబ్బతిన్న మనసుతో.

వాటికిచ్చే గారంటీ రెండు సంవత్సరాలే అయినా, అవి ఆర్నెల్లకే నల్లబడ్డం ప్రారంభిస్తాయి. సంవత్సరం ఆయేసరికి ఇహ వుపయోగించ వీలులేకుండా తయారౌతాయ్.

ఇప్పటికి ఐదు సంవత్సరాల బట్టి, దాదాపు దసరా ముందు జానకి ఆమాట అనకమానదు. రమణమూర్తి తన అశక్తతకు, చేతకాని తనానికి బాధపడకా తప్పదు. ఆఖరికి బాధపడ్డమే మిగులు.

మళ్ళీ ఇప్పుడూ అలాగే అదే మెత్తని కంఠంతో అంది జానకి.

'ఏవండీ గొలుసు నల్లబడుతోందండీ'

గొలుసు కేసిగాని, జానకి ముఖంకేసిగాని చూళ్ళేని రమణమూర్తి, బరువుగా కళ్లు దించేసుకున్నాడు.

అతని తల ఎప్పుడూ ఆలోచనలతో సతమతమౌతూ ఉంటుంది. అందుకే గుబురుగా, నిగనిగలాడుతూండాల్సిన ఉంగరాలజుత్తు, పల్చబడి, పట్టబుర్ర తొంగిచూడనారంభించింది. మిగిలిన ఆ నాలుగు వెంట్రుకలూ అనుభవాన్ని తెలియజేస్తూ తెల్లగా నవ్వడం ప్రారంభించాయి.

రోల్డుగోల్డుచైనా, గొలుసు పాతిక్కి తక్కువకాదు. పాతిక రూపాయలంటే ఎవంత తక్కువని? జీతాలు పెరగటంతో కలిగిన సంతోషం ఒక్కరోజైనా మిగలకుండా, తెల్లవారేసరికి, సరుకుల రేట్లన్నీ బుసబుస పెరిగిపోతాయి.

ఈ మధ్య రమణమూర్తి ఓ వింత తత్వం డెవలప్ చేశాడు. అది మంచిదేగాని, సాగొద్దూ?

దేన్నీ పట్టించుకోకపోవడం, తన హృదయాన్నీ దారి చేసే సమస్యల నుండి దూరంగా తొలగిపోవడం, అసలు వాటి గురించి ఆలోచించకపోవడం - ఇదీ రమణమూర్తి డెవలప్ చేసిన తత్వం.

'తామరాకుమీద నీటి బిందువులా వుండడం నేర్చుకుంటే, మనకే బాధలూ అంటవు. అసలీ సమస్యలు మనకి సంబంధించినవి కావు-అని మరిచిపోవడం ఉత్తమ మార్గం -' అని జగన్నాథం ఇచ్చిన సలహా వింటే రమణమూర్తికి, ఎప్పుడో ఒక క్షయరోగికి - ఒక డాక్టర్ ఇచ్చిన సలహా జ్ఞాపకానికి వచ్చింది.

'అసలు నువ్వీ జబ్బు గురించి మరిచిపోవాలి. నీకీ జబ్బు వుందనే విషయం నీ తలలోకి రానివ్వకూడదు. నువ్వు చెయ్యవల్సిందల్లా ఒక్కటే-రెగ్యులర్ గా మందుతిండం-'

అతని సలహా విలువైందికాదని నేననను. గానీ తిమ్మిరెక్కి, స్పర్శజ్ఞానం లోపించిన చేతులకు కాళ్ళకు తగిలే దెబ్బలు, కారే రక్తం, వద్దనుకున్నా కళ్ళకు కనిపించే

మొండి చేతులూ, ముసిరే ఈగలు, వచ్చే దుర్గంధం - ఇవన్నీ, ఆ సలహా ఇచ్చినంత సులభమా మరిచిపోవడం?

ఒకవేళ ఆ రోగి మరిచిపోయినా, లోకం-, చుట్టూ వున్న వాతావరణం, వాణ్ని వీటినుండి దూరంగా వుండనిస్తుందా?

నన్నడిగితే-ఈ రోగంకన్నా మహా భయంకరమైనది దారిద్ర్యం. ఈ రోగానికి మందుంది. కొన్ని నియమాలు పాటిస్తే, కొన్ని సంవత్సరాలలో రోగ నిర్మూలన అవుతుంది. రోగాన్ని మరిచిపోవడం మాత్రం అసంభవం.

గానీ, దారిద్ర్యరోగ నిర్మూలనకు మందులేదు, నిమిష నిమిషం అది, ఇంటా బైటా తన విశ్వరూపం చూపక మానదు.

◆ ◆ ◆

ఎరియర్స్ బిల్లు పాసయిందని విన్న స్టేఫ్ చాలా ఆనందంగా వుందారోజు, క్యాష్ పట్టుకుని మేనేజర్ ఎప్పుడు బాంకినుండి వస్తాడా అని వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్నారంతా.

రమణమూర్తి తలలో వెయ్యి ఆలోచనలు కలిగాయ్.

'ఇవాళ ఈ డబ్బుతో, జానకికి చిన్నదో చితకదో ఒక బంగారు గొలుసు కొనేయాలి, ఇక రోల్డుగోల్డు బతుకవద్దు. వచ్చేది దాదాపు మూడు వందల ఏభై. దాంతో తక్కువలో ఒక తులంన్నర గొలుసు రాకపోదు' అనుకున్నాడు.

మేనేజర్ క్యాష్‌బేగ్ పట్టుకొస్తుంటే, భగవంతుడే నోటూ బూటూలో వస్తున్నట్టు ఫీలయారంతా.

తన బిల్లు డబ్బు అందుకున్న రమణమూర్తి చాలా రోజుల తర్వాత ఎంతో ఆనందంగా వున్నాడు. మనిషిలా నవ్వాడు. ఆరోగ్యవంతమైన నిండైన నవ్వు నవ్వాడు. యుద్ధంలో గెల్చిన అలెగ్జాండర్‌లా నవ్వాడు లోకమాతను చూసిన వేదాంతి రామకృష్ణ పరమహంసలా నవ్వాడు. స్వాతంత్ర్యం వచ్చిన రోజున గాంధీగారిలా నవ్వాడు. పరీక్ష పాసైన బీద విద్యార్థిలా నవ్వాడు.

నవ్వుతూనే ఆఫీసువదిలి చెన్నయ్య శెట్టి దుకాణం వేపు పరిగెత్తాడు. బేరంచేసి, తనకి నచ్చిన గొలుసు ఒకటి తీసుకున్నాడు. బిల్లు నాలుగువందల చిల్లరైంది. మూడువందల యాభై ఇచ్చేసి మిగతావి, నెలాఖరుకి ఇస్తానని ఒప్పించి, సంతకంచేసి, గొలుసు భద్రంగా జేబులో వేసుకుని, ఉల్లాసంగా, గబగబా ఇల్లు చేరాడు.

ఇల్లు చేరగానే ఏదో గొడవ జరుగుతున్నట్టు గ్రహించాడు. ఇంట్లోకి వెళ్ళిచూస్తే ఇంకేవుంది, జానకి గోలపెట్టి ఏడుస్తోంది. పక్కనే మూలుగుతూ పడుకుని వున్నాడు. బాబిగాడు.

'వూరుకో జానకమ్మ! వాళ్ళ నాన్నరానీ ఆసుపత్రికి తీసుకెడతారు. మరీ అంత బెంబేలుపడితే ఏం లాభం?' వూరుకోబెడుతోంది పక్కింటి విశాలాక్షి.

బాబిగాడు డాబామీద ఆడుకుంటూ, 'కాలుజారి కింద పడ్డాట్ట' పడ్డంలో కాలూ చెయ్యీ మడత పడ్డాయట, నుదురుమీద బలంగా గాయం తగిలి రక్తం కారుతోంది.

ఆస్పత్రి దగ్గర్లో లేదు! కనీసం రెండు మైళ్ళు వెళ్తేగాని రాదు. రిక్షాలు దొరకవు. ఇరుగూ పొరుగూ అంతంత మాత్రమే. ఒక్కర్తీ ఏం చెయ్యడానికీ తోచక, దెబ్బలు చన్నీళ్ళతో కడిగి, పాతగుడ్డతో కట్టుకట్టింది. కాలూ చెయ్యీ కదిపితే పిల్లాడు కిరకిరలాడి పోతున్నాడు.

రంగులతల చెదిరిపోయినట్టు, రమణమూర్తి ఆలోచనలకు స్వస్తి చెప్పి, పిల్లాణ్ని భుజంమీద వేసుకుని గబగబా వీధికేసి నడిచాడు. వెనక జానకి నేనూ వస్తున్నానని, ఇంటికి తాళంవేసి, తానూ బయలుదేరింది.

◆ ◆ ◆

డాక్టరు ఎక్స్‌రే తీశాడు. మూడు చోట్ల ఫ్రాక్చరైందన్నాడు. ప్లాస్టర్ వెయ్యాలన్నాడు, మూడు ఇంజక్షన్ ఇవ్వాలన్నాడు. మొత్తం రెండు వందలవరకూ అవుతుందన్నాడు. వెంటనే ఒక నూరు రూపాయ లిమ్మన్నాడు.

రమణమూర్తి ఏమీ ఆలోచించే స్థితిలో లేడు. జీతం అందుకున్నాడప్పుడే. జేబులో నూర్రూపాయల కంటే ఎక్కువేవుంది. అన్నిటికన్నా ముఖ్యం బాబిగాడి ఆరోగ్యం.

'వాణ్ని చంపేస్తే చంపేయ్. గానీ అవిటివాడిగా మాత్రం బతకనివ్వకు భగవాన్-' అని మనసులో అనుకున్నాడు.

డాక్టర్ చేతిలో నూర్రూపాయలు పెట్టాడు.

ఆరాత్రి అక్కడే పడుకున్నారిద్దరూ. మర్నాడు ఆఫీసుకి శెలవు పెట్టాడు. బాబిగాడికి ప్లాస్టర్ వేశారు డాక్టర్. చేతికీ, కాలుకీ ప్లాస్టర్స్‌తో, తలమీద కట్టుతో, బాబిగాణ్ని ఇంట్లోకి తెస్తూంటే కుళ్ళి కుళ్ళి ఏడ్చింది జానకి.

'మంచి బట్టలు లేకపోతే బాధపడలేదు. కడుపు నిండా తిండి లేకపోతే ఏమీ అనుకోలేదు. అవసరానికి వొంటిమీదున్న బంగారం ఇచ్చేసినప్పుడూ చింతించలేదు. గానీ ఇంకా నీకు తృప్తి కలగలేదా భగవాన్! ఏది లేక పోయినా ఫరవాలేదు - ఆరోగ్యం ఇచ్చావ్ - అంతేచాలని సంతోషించాను. ఇలా కాలూ చెయ్యీ

విరిచేసి ఎందుకింత నరకాన్ని సృష్టించావయ్యా? ఇప్పటికైనా సంతోషం కలిగిందా లేక ఇంకా ఏమైనా మిగిలి పోయిందా? అని జానకి మనసులో విలవిల్లాడి పోయింది.

తాను కొన్న గొలుసు జానకి మెడలో స్వయంగా వేద్దామని, పచ్చని ఆమె మెడలో జిగజిగ మెరిసే గొలుసు చూసి మురిసిపోవాలని, స్త్రీ సహజమైన తృప్తి ఆమె ముఖంలో చూసి పొంగిపోవాలని ఆశించిన రమణమూర్తి పాతాళానికి కుంగిపోయాడు.

బాబిగాడికి ప్లాస్టర్ వేసిన మూడోనాడు, జానకికి, తనకి ఎరియర్స్ వచ్చిన సంగతి, దాంతో తాను గొలుసు కొన్న సంగతి చెప్పాడు.

జానకి పేలవంగా నవ్వింది, నవ్వాలి కాబట్టి నవ్వింది. ఆ నవ్వులో తృప్తిగాని, ఆనందంగాని ఏమీలేవు. బాబిగాడి ఆరోగ్యం ఆమె మనసుని దొలిచేస్తోంది.

రమణమూర్తి జానకిచేతికి గొలుసిచ్చి తీసుకోమన్నాడు. ఆమె దాన్నందుకుని, పెట్లో పెడుతూ–

'బాబిగాడు ఆరోగ్యంగా తిరిగేవరకూ మనకీ బంగారాలూ వద్దు–' అంది.

పదిరోజులు గడిచాయి. బాబిగాడు చిక్కి శల్యమై పోయాడు. మంచంనుంచి కదల్లేక పోతున్నాడు. ఆరోజు బాధ మరీ ఎక్కువగా వుంది.

ప్లాస్టర్ వేసిన కాలి, చేతి–వేళ్లు వాచిపోయాయి. డాక్టర్కి కబురుపెడితే, మిగిలిన సొమ్ము ఇవ్వలేదు కాబట్టి రావడానికి గునిశాడు, కాంపౌండర్ చెప్పాడు– 'మిగిలిన డబ్బంతా పంపించేయిండి వస్తారు–' అని.

ఆ నెల ఏబాకీలు తీర్చలేదు. చేతిలో ఇంకా కొంత చిల్లర వుంది. అది పంపించేసి, మిగతాది తర్వాత ఇస్తామన్నాడు.

డాక్టర్ వచ్చిచూసి 'లోపల ఇన్ఫెక్షన్ వున్నట్టుంది, కట్టు విప్పేయాలి–' అన్నాడు. అసిస్టెంటువచ్చి, ప్లాస్టర్ విప్పేశారు. మళ్లా ఎక్స్రే తీశాడు. ఏవేవో పరీక్షలు చేశాడు, ఆఖరికి రమణమూర్తిగారూ... తిరిగి ప్లాస్టర్ వెయ్యడానికి వీల్లేదు, బోన్లో ఇన్ఫెక్షన్ వున్నట్టుంది ఇక్కడెక్కడైనా పిల్లాడికి ప్రమాదం రావచ్చు, వెంటనే వెల్లూరు తీసుకెళ్ళడం మంచిది' అన్నాడు.

రమణమూర్తి మ్రాన్పడి పోయాడు. జానకి నిలువునా కూలబడి పోయింది పిల్లాడికి పళ్లూ, బిస్కట్లు కొనివ్వడానికే ఇటూ అటూ చూసే పరిస్థిలో వెల్లూరు ఎలా తీసికెళ్ళడం? చూస్తూ చూస్తూ పిల్లాణ్ని ఎలా బలి చెయ్యడం!

ఇద్దరు నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తున్నారు: వారి తలలో నరాలు మొద్దుబారాయ్. ఆలోచించే శక్తి సన్నగిల్లింది. బాబిగాడి పక్కమీద బాధగా మూలుగుతున్నాడు.

వున్నట్టుండి జానకి లేచింది, గదిలోనికి వెళ్ళి క్షణంలో తిరిగొచ్చింది.

రమణమూర్తి తెచ్చిన బంగారు గొలుసుని, అతనిచేతిలో వుంచింది, అంతే మరేం అనలేదు.

అతనుకూడా ఏమీ అనలేదు, జానకివేపు చూళ్ళేదు, కన్నీళ్లు తుడుచుకోలేదు, జోడైనా వేసుకోలేదు వీధిలోకి చరచరా నడిచాడు.

జానకి బాబిగాడి వేపు చూస్తూ 'ఈ బంగారాల కంటే, బాబిగాడి భవిష్యత్తే నాకు ముఖ్యం, వాడి ఆరోగ్యంకన్న ఈ ప్రపంచంలో నాకింకేదీ ముఖ్యం కాదు–' అనుకుంది మనసులో.

అందానికి......
మన్నికకు......
"సెంజి" బనియన్లనే వాడండి.



SENJI BANIANS
Trade Mark Regd. No. 9087/75
ఆంధ్రప్రదేశములలో జిల్లాలవారిగా
ఏజెంట్లు కావలెను.
వివరములకు.
SENJI KNITTING CO.,
1-A, Arthanari Chettiar Lane
TIRUPUR 638604.

Edited & Published by A.N. Raghavachar, 6-B. Murugesamudali St., Madras 600001
Printed by R. Bakthavachalu Bharathamatha Press, 39, Anderson St., Madras 600001